"512"

'హాల్ట్! హు కమ్స్ దేర్?'

('ఎవరావచ్చేది? నిలు' అని అర్థము.)

సర్కారు ఖజానాలోని గడియారం టంగుటంగున పదిసార్లు బదులుపలికింది.

వొట్టి భ్రమేనా???

ఒకవిధమైన రిచ్చపాటులో పడ్డాడు- 512.

ఆ స్టేషనుకు కొత్తగా ట్రాన్సుఫరయి వచ్చిన పోలీసు జవాను అతడు. అసలు పోలీసు నౌకరీకే కొత్త అని చెప్పవచ్చు. అతనికి హితవు లేకపోయినా వచ్చిపడిందీ ట్రాన్సుఫరు.

ఇక్కడకు వచ్చిన ఈ నెల్లాళ్ళుగా ఆ సబినస్పెక్టరు ముండావాడు అతనికి తరచు పల్లెలమీదనే కాగితాల డ్యూటీ వేసి ఇంటిపట్టున ఉండనీకుండా చేస్తున్నాడు. కొత్తగా కాపరానికి వచ్చిన భార్య. కొత్త ఊళ్లల్లో తనతో ఒంటరిగా తిరిగి కాపురం చేయడానికి భయమౌతోందని జంకిన ఆ అబలకొరకు ఎంత త్యాగమైనా చేసి ఆమెశీలం కాపాడి రక్షిస్తానని అభయహస్తమిచ్చిన శూరుడు- 512. కాని ఈ స్టేషనుకు వచ్చినది లగాయతు సబినస్పెక్టరు వైఖరే అతనికి కంటకంగా ఉంటోంది.

చలికాలం, చీకటిరాత్రి. రూపసియగు భార్యను ఇంటి దగ్గర ఒంటరిగా విడిచి తాను డ్యూటీచేయడానికి వచ్చేశాడు. సబినస్పెక్టరు ప్రవర్తన మంచిది గాదని లైనులో చెప్పుకొంటున్నారు. ఈవిధంగా తనను ఒంటరిగా విడిచి ఉద్యోగాలు చేసినట్టయితే, తానక్కడ ఉండలేననీ, పుట్టింటికి వెళ్ళిపోతాననీ గోలచేయడం మొదలుపెట్టింది భార్య. కొంతకాలం వరకూ తనకు రాత్రిపూట డ్యూటీ తప్పించవలసిందని లోపాయికారీగా ఎంత ప్రార్థించుకొన్నా వినిపించుకొన్నాడు కాడు సబినస్పెక్టరు.

రాత్రి పదిగంటల కారంభమైన ఖజానా డ్యూటీ ఒంటి గంటకుగాని పూర్తికాదు. ఇంటికిపోవడం ఎప్పుడబ్బా!

చికాకో, పరాకో, ఉండి ఉండి-

"హాల్ట్! హు కమ్స్ దేర్?"

అని మళ్ళా కాషన్ ఇచ్చాడు.

పంచభూతాత్మకమైన శరీరం జెయిలుడ్యూటీలో బందీకృతమై పోయిందిగాని, అతని పంచప్రాణాలూ ఇంటి దగ్గర ఇల్లాలిచుట్టూ ఫారా తిరుగుతూనే ఉన్నవి.

"ఛీ! ఆడజాతి! పిరికిజాతి! పరాధీనమైన బ్రతుకు! తన శీలం తాను కాపాడుకోలేని ఆడదాని బ్రతుకు బ్రతుకేనా! మొగవాడయినవాడు ఆడదాన్ని ఎంతదూరమని కాపాడి రక్షించగలడు? పోలీసు జవానుల్లాగా ప్రతీ ఆడదానికీ ఒకతుపాకీ సప్లయి చేసి ఆత్మరక్షణ కోసం తుపాకీగుండు గురిచేసి పేల్చడం సర్కారువారు నేర్పిస్తే బాగుండును.

దుర్మార్గులెవరూ రాత్రిపూట ఒంటరిగా ఉండే సమయం కనిపెట్టి తన ఇంటిపైకి రావడం లేదుగదా! ఆ దుర్మార్గుల దౌర్జన్యానికి లోబడి తన ధర్మపత్ని గడగడ వొణికిపోవడం లేదుగదా! ఎదిరించడానికి ఆమెదగ్గర తుపాకీ కూడా లేకపోయెనే!"

తల పగిలిపోతోంది 512కి.

దట్టంగా పెరిగిన చీకటిలో గాలికి కదిలే నల్లని చెట్లనుకూడా నమ్మలేక,

"హాల్ట్! హు కమ్స్ దేర్?" అని వెర్రికేక పెట్టాడు 512.

తన కాషన్ భార్య కాపురంచేసే ఇంటిదాకా వ్యాపిస్తుందా!

సబ్‌జెయిలు ఇనప కమ్ములసందున కూని దీర్ఘాలుతీసే పాట నిలిపి, హ, హ, హ అని వికటహాస్యం చేశాడు ఒక ఖయిదీ.

512కి ఒళ్ళు చిర్రుమనింది.

"నువ్వు ఏడనో కొత్త బిచ్చగాడివిలా ఉండావే" అన్నాడు ఖయిదీ.

ఉన్నమాట అంటే ఉలుకు ఎక్కువ. తను కొత్త పోలీసు జవానన్న సంగతి ఎట్లా తెలుసుకోగలిగాడు- ఖయిదీ! తన అంతర మేమిటి? వాడి అంతర మేమిటి? నోటి కెంత వస్తే అంతేనా! కొత్త బిచ్చగాదని తనని ఎగతాళి చేస్తాడా!

"నోరు మూసుకో" అని ఖయిదీని గద్దించి-

"హాల్ట్, హు కమ్స్ దేర్?"

అని మళ్ళా అరిచాడు 512.

"అబ్బో!" అని సాగతీసి, పకపక నవ్వేడు ఖయిదీః

చలికి ముడిచిపెట్టుకొని లాంతరు క్రీనీడని పడుకున్న వార్డరు లేచి చుట్ట ముట్టించాడు.

ఖాకీయూనిఫారం, నెత్తిన 512 నెంబరు ఎర్రటోపీ, నడుముకు సరికొత్త తోలుబెల్టూ, బెల్టుకు తగిలించిన మూడు జానల పొడుగులాఠీ, కుడిభుజంమీద బాయ్‌నట్టు తగిలించి లోడ్డుచేసిన వొంటి నల్లికేపు తుపాకీ! రైట్, లెఫ్ట్! రైట్, లెఫ్ట్! అడుగులు కొలుచుకొంటూ, మిసమిసలాడే త్రాచుపాము చురుకుదనంతో సబ్ జెయిలుకూ, సర్కారు ఖజానాకూ పారాయిస్తున్నాడు 512.

హాలులో వేలాడగట్టిన హరికేన్ లాంతరుదీపం కాంతిలో తన రెండు భుజాలకూ తగిలించిన ఇత్తడి బిళ్ళ ఇంగ్లీషు అక్షరాలు తళతళ మెరిసిపోతున్నవి. పిక్కలకు చుట్టిన ఖాకీసాక్సు, కాళ్ళకు తగిలించిన క్రోములెదరు తెల్ల చెప్పులూ బిర్రుతగిలి, అంత చికాకులోనూ అతని శరీరాని కొకవిధమైన ఉత్సాహాన్ని చేకూరుస్తున్నవి.

రెండు లక్షల రూపాయల సర్కారునగదు గల ఖజానా, దొంగతనం, బందిపోటు, ఖూనీ వగైరా నేరాలు చేసిన ఖయిదీలు జెయిలు బిల్డింగూ, ప్రపంచాన్నంతటినీ చుట్టబెట్టిన బ్రహ్మాండమైన అంధకారమూ- ఇప్పుడు తన ఏలుబడికి లోబడి ఉన్నట్లేకదూ! అబ్బా! ఒక్క పోలీసు జవానుకు ఎంత నిరంకుశమైన అధికారం! "హాల్ట్" అని తాను సాదరుచేసే ఒక్క మూజువాణీ ఉత్తర్వు నతిక్రమించి తనను సమీపించడానికి ఆ చీకటికూడా గడగడలాడవలసినదే. లేకపోతే తన హస్తగ్రస్తమైన తుపాకీ ప్రయోజనమేమిటి?

నూనూగు మీసంమీద చేయి వేసుకొని సవరించుకొన్నాడు 512. మెత్తని నున్నని గడ్డం నిమురుకొన్నాడు. ఉబికి పైకి పొంగే ఛాతీ విరుచుకొని, ఊపిరిలోపలికి ఎగపీల్చుకొన్నాడు. జెయిల్లో ఖయిదీలు దగ్గినా, సకిలించినా కూడా బడిపంతులు పిల్లకాయల్ని అదిలించినట్లు అదిలిస్తున్నాడు.

కాని, వీడెవడు? ఇనపకమ్ముల సందున ఇరుక్కొని కూడా తన అధికారానికి లోబడి ఉండేటట్లు లేడే!

దూరాన్న చెట్లగుబురులో సవ్వడి విని,

"హాల్ట్! హు కమ్స్ దేర్!"

అని వెర్రికేక పెట్టాడు 512.

"నీకు అస్తావిస్తమా ఏందయ్యా?" అని ప్రశ్నించాడు ఖయిదీ.

చీకటిలోకి గురిచేసిన తుపాకీ దింపి ఇనప కమ్ములవైపు తిరిగి గుడ్లెర్ర చేశాడు- 512.

తోక లొటలొట లాడించుకొంటూ ఊరకుక్క ఒకటి లాంతరు కాంతిలో మెరిసింది.

"కాల్చక ఇంకా చూస్తావేందయ్యా" అని కడుపు పిసుక్కొంటూ నవ్వేడు ఖయిదీ.

"కిషన్" అని పలకరించాడు వార్డరు.

"నేను జెయిల్లోపడ్డ ఈ రెండు నెలలుగా నువ్వు నాకు అగపడలేదు- నువ్వేమయినా కొత్తగా చేరినావా ఏందయ్యా ఈ పోలీసుల్లో? నువ్వీ నౌకరీకి లాయఖు కావే?" అని రిమార్కు చేశాడు ఖయిదీ.

కిషన్సింగు రసపుత్రరక్తం సలసలలాడింది. తానింకా సార్జంటుగానూ, సబినస్పెక్టరుగానూ ప్రమోషన్ అయి పైకి పోవాలనుకొంటుంటే, కానిస్టేబిలు నౌకరీకి కూడా లాయఖు కాదంటాడా ఈ ఖయిదీ! వీణ్ణి ఈ పాటున కాల్చి పారేసినా దోషమున్నదా?

"తేపతేకూ తుపాకీ గురిచేస్తావు. ఎంతమందిని కాలుస్తావేందయ్యా?" అని ఇంకా ఎగతాళిగానే మాట్లాడుతున్నాడు ఖయిదీ.

"అధిక ప్రసంగం చేస్తివా- ముందు నిన్ను కాలుస్తా చూడు" అన్నాడు 512.

"నిదానించు, నిదానించవయ్యా మొనగాడా" అన్నాడు ఖయిదీ.

"ఎంత మొండి ముండాకొడుకువురా" అని నోట్లో చుట్ట తీసి కొడి దులిపాడు వార్డరు. "ఎవరీ ఖయిదీ? పేరు చెప్పు వార్డర్" అన్నాడు 512.

"నాపేరు యానాది ఆదిగాడు. రాసుకో" అన్నాడు ఖయిదీ.

"వీడు చేసిన నేరమేమిటి వార్డర్?" అన్నాడు 512.

"నే చేసిన నేరం చెప్పితే పోతుంది గాని నువ్వు పసివాడివిలాగా ఉండావే, నీకు పెళ్ళి అయిందటయ్యా పోలీసాయనా" అని అడిగాడు ఖయిదీ.

అదుగో! తన పెళ్ళిసంగతి ఈకుంక కెందుకూ!

"అయిందిరా" అని వార్డరే జవాబు చెప్పాడు.

"భార్య సంసారానికి రాలేదా?" అని క్రాస్ చేశాడు ఖయిదీ.

"వచ్చిం"దన్నాడు వార్డరు.

512 ఒంటిమీద తేళ్ళూ, జెర్రెలూ పాకి పోతున్నవి.

"అయితే, అపరేత్రికాడ ఆ పిల్లని ఇంటికాడ ఇడిపించి నువ్వీడ ఉద్యోగం చేయడానికి తయారయినా వంటయ్యా మొనగాడా" అన్నాడు ఖయిదీ.

తన తుపాకీగుండుకు ఆ రాత్రి ఆదిగాడి ఆయువు మూడిందనుకొన్నాడు 512.

"ఆదిగా" అని పలకరించాడు వార్డరు.

"అదే యానాదివాడయి, యానాదికులంలో పుట్టిన మొనగాడయితే, ఉద్యోగాలు కాదు, ఊళ్ళేలటాలు కాదు; మిన్ను విరిగి మీదపడ్డా కట్టుకొన్న ఆడదాన్ని ఇడిపించి ఉండగలడయ్యా వార్డరయ్యా" అన్నాడు ఆదిగాడు.

"ఆ మాటమాత్రం నిజం" అన్నాడు వార్డరు.

"ఒరే! యానాదీ! ఇది సర్కారు జెయిలు. నీవు ఖయిదీవి. అర్ధరాత్రిపొద్దు, గలభా చేస్తున్నావు. నా చేతిలో తుపాకీ గమనించావా? భద్రం." అని ఆక్రోశం పట్టలేక మీదికి రాబోయాడు 512.

"రావోకు రావోకురా- చందురూడా

రావోకు రావోకురా - చందమామా."

అని చీకటి చించుకొని ఒక మధురగానం గాలిపాటుకు జెయిలుమీదికి దూకింది.

"హాల్ట్! హు కమ్స్ దేర్!"

అని కాషన్ ఇవ్వాలని 512 ప్రయత్నించాడు కాని చీకట్లో తిరిగే తియ్యని పాట అతని కర్ణపుటాలలో పడేవరకు ఉక్కిరి బిక్కిరయి అతని గొంతుకు పెగలలేదు.

అరమోడ్పు కన్దోయితో వార్డరు చుట్టపొగ దీర్ఘంగా పీల్చి నిదానంగా విడిచాడు.

చీకటి గుబురులో విహరించే తీయని పాటకు చప్పట్లతో తాళంవేస్తూ ఇనపకమ్ములలోని కాహ్వాన మిస్తున్నాడు ఆదిగాడు.

"రావోకు రావోకు

రాహు పొంచున్నాడు త్రోవలోన

ఆకొక్క టైనాను అల్లాడకున్నాది

మబ్బుల్ల పై నేమో మాయ గప్పేసింది.

రావోకురా-"

అని చీకటి ఇంకా పాడుతూనే ఉన్నది.

512 కి అర్థం కావడం లేదు. "హాల్ట్! హు కమ్స్ దేర్!" అని కాషన్ ఇవ్వడమా, మానడమా?

"అందుకోరా ఆదిగా" అన్నాడు వార్డరు.

"తెల్లని నీకాంతి నల్లనయ్యేనురా

చల్లని నీమోము సన్నగిల్లేనురా

రావోకురా-"

అని ఆదిగాడు అందుకొని పాటలో పాట కలిపేడు.

"పరమరాకాసిరా" అని చీకట్లో పలికే పలుకే "పరమ రాకాసిరా" అని జయిలు కమ్ముల్లో ప్రతి ధ్వనిస్తున్నది.

"మిత్తిలా నినుబట్టి మింగబొయ్యేనురా

రావోకురా, రావోకురా, రావోకురా,"

అని ఏ కంఠం ఎక్కడనుండి పలుకుతున్నదో భేదం తెలియకుండా బయట చీకట్లోనూ, లోపల జయిల్లోనూ ఒకేపాట బయల్దేరి ఆకాశమంతా ఆవరించింది.

అంతా అయోమయంగా ఉంది 512కి.

"పోలీసాయనా" అని పలకరించాడు ఆదిగాడు.

ఆదిగాడు అంతటి పాటకుడా! మరి ఆ చీకట్లో పాడే మనిషి ఎవరు? ఎవరో స్త్రీ కంఠంలా ఉన్నదే!

అర్ధరాత్రి సమయంలో ఆడమనిషి ఒంటరిగా జయిలు దగ్గర కెందుకు వస్తున్నట్లు? సరిగా ఆ మనిషి పాడినపాటే ఇక్కడ వీడు కూడా పాడుతున్నాడే.

512కి ఆశ్చర్యమైపోతోంది.

"తీసుకో, తుపాకీ తీసుకో" అన్నాడు ఆదిగాడు.

512 కి ఆదిగాడంటే అయిదు నిమిషాలకు పూర్వం ఉండిన అభిప్రాయం ఇప్పుడెక్కడికో పారిపోయినట్టని పించింది. కాని తుపాకీ తీసుకోమంటాడేమిటి?

చెట్లసందన మెదిలే మనిషి సవ్వడి గమనింపనేలేక పోతున్నాడు 512.

"ఆల్టు- ఊ - కంచుదే-" అని పకపక నవ్వేడు ఆదిగాడు.

మళ్ళా కుక్క ఏదయినా తిరుగుతున్నదా అని కలయ చూచాడు 512.

"చూస్తా వేందయ్యా పోలీసాయనా! దగ్గరికి వచ్చేసింది రాకాసి.....

"పరమరాకాసి రా పరమరాకాసిరా-"

అని పాడుతూ "ఊ! కొట్టు, కొట్టు" అని గలభాచేస్తున్నాడు ఆదిగాడు.

చుట్టపారేసి, మంచినీళ్ళు పుక్కిలించాడు వార్డరు.

"వచ్చె వచ్చె, మీదబడి
మిత్తిలా నినుబట్టి మింగబొయ్యేనురా,
కాల్చేయవయ్యా, తుపాకీ పేల్చేయవయ్యా."

అని అదిలిస్తున్నాడు ఆదిగాడు.

ఏమిటీ యానాదివాడి ఆగడం? ఊరుకున్న కొద్దీ మితిమీరుతున్నదే వీడి వ్యవహారం!

512 చూపుచీకట్లోనే చిందులాడింది. చీకటికంటె నల్లనిచీర, చీరకంటె చిక్కని శరీర కాంతి, శరీర కాంతిని తలదన్నే శిరోజపుంజం, శిరోజపుంజాన్ని వెలిగించే శిరీష కుసుమాలు- ఆ మనిషి సెంట్రీని సమీపించినకొద్దీ,

"హాల్ట్" అని కాషన్ ఇవ్వాలనిగాని, తుపాకీ తీసుకోవాలనిగాని ఈసారి 512 మరచిపోయాడు.

"వార్డర్! ఎవరీ మనిషి?" అని అడిగాడు 512.

వార్డరు జవాబు చెప్పేలోపలనే,

"నా అగచాట్ల కన్నిటికీ ఈ రాకాసిముండే కారణం. ముందు దీన్ని కాల్చిపారెయ్యి." అన్నాడు ఆదిగాడు.

"ఈ మనిషి నీకేం గావాలిరా" అని అడిగాడు 512.

"చస్తే బూడిద కావా"లన్నాడు ఆదిగాడు.

"కిషన్! ఈ మనిషి ఆదిగాడి భార్య. ప్రతిపూటా ఇక్కడకు వచ్చి పెనిమిటిని చూచి పోతూ ఉంటుంది" అన్నాడు వార్డరు.

"నా పలుకు వినవైతివోయీ రాకుమారా,

నీ ఉసురు నేతీతునోయీ, రాకుమారా..."

అని పాడి నాట్యం చేసింది ఆడమనిషి. దానికి మతి భ్రమించింది గాబోలు ననుకొన్నాడు 512.

"దీనికి ఉన్మాదమయ్యా పోలీసాయనా!" అన్నాడు ఆదిగాడు.

"ఛీ! నోరుమూయ్" అన్నాడు వార్డరు.

"మామా......." అని పిలిచింది, ఆడమనిషి, "ఏమే-"

"ఈ పొద్దు మా అమ్మగారు ఇంటికాడ పండగచేసుకొని అప్పచ్చులు పెట్టిందే. నీకోసం మూటకట్టుకొని తెచ్చా" అని ఆదిగాణ్ణి సమీపించింది వాడి భార్య.

"ఆ! ఆ! నిలబడు" అని ఖంగారుపడుతూ అటకాయించింది 512 అధికారం.

"ఆ పోలీసాయన క్కూడా రెండు అప్పచ్చులు లంచం పెట్టవే పిల్లా" అన్నాడు ఆదిగాడు.

"వార్డర్, ఖయిదీల కిట్లా పెట్టవచ్చునా" అని అడిగాడు 512.

"వార్డరయ్యా! ఈ పోలీసాయన ఇప్పుడే వోడ దిగి వచ్చినట్టుండాడే" అన్నాడు ఆదిగాడు.

"జెయిలు సూపరెంటుగారు వీడి విషయమైచూసీ చూడనట్టు ఉండమన్నారు. ఆ మనిషి వీడి భార్య. వీణ్ణి అరెస్టు చేసినప్పటినుండీ ఆ మనిషి సూపరెంటుగారి ఇంటికాడనే పనిచేసుకొంటూ పెనిమిటిని విడిచిపెట్టి పోలేక ఇక్కడనే పడి ఉన్నది. పోనియ్యి" అన్నాడు వార్డరు.

"అసలు వీణ్ణెందుకు అరెస్టు చేశారు?" అని అడిగాడు 512.

"నీలాంటి ఒక పోలీసు కానిస్టేబులును తుపాకీతో కాల్చి చంపేసినందుకు" అన్నాడు ఖయిదీ.

"ఆఁ–" అని ఉలిక్కిపడ్డాడు 512.

తనవంటి పోలీసు కానిస్టేబులంటాడు. ఏమి వీడి పొగరనుకొన్నాడు 512.

"కానిస్టేబిలు వెంకటసామి వీడి భార్య ఈ లక్ష్మిని బలవంతంగా పట్టుకోబోయేవరకు వీడు తుపాకితో కాల్చి చంపేశాడు" అన్నాడు వార్డరు.

ఠంగుమని సెంట్రీగడియారం కొట్టింది.

"సత్యం! సత్యం! నా ఏలినవాడా!" అన్నది లక్ష్మి.

"వీళ్ళది యానాదికులమైన మొదటినుండీ వీళ్ళు వీధి నాటకాలూ, భాగోతాలూ, పాటలూ నేర్చుకొని, ఊరూరా నాటకాలాడి జీవనం చేసుకొనేవాళ్ళు" అన్నాడు వార్డరు.

"లక్ష్మి కంఠం కోకిలకంఠం" అన్నాడు 512.

"దానిఆటా, దానిపాటా ఇవే దానికి వంద తెచ్చిపెట్టినవి. వెంకటసామి రౌడీ ముండాకొడుకు. దాని వెంట బడ్డాడు."

"………………"

"ఒకరోజు సంజచీకటికాడ వీళ్ళిద్దరూ పొరుగూరు నుండి యానాది పాలేనికి పోతుంటే ఒంటరిగా చిక్కేవరకు తన పోలీసు అధికారం చూపి ఆదిగాణ్ణి చెట్టు మొదట్లో విరిచి కట్టి, లక్ష్మిని పట్టుకోబోయాడు వెంకటసామి–" అన్నాడు వార్డరు.

"మామా. నాకు బయమౌతున్నదే" అన్నది లక్ష్మి.

"గమ్మున ఉండు. ఆ పెద్దమనిషిని చెప్పనియ్యి–" అన్నాడు ఆదిగాడు.

"వార్డర్" అన్నాడు 512.

"లక్ష్మి తిరగబడి వెంకటసామి మీద రాళ్ళు రువ్విందట. వెంకటసామికి ఒళ్ళు మండి దాన్ని జుట్టుపట్టుకొని బరబర లాక్కొని వచ్చాడట. ఇంతలో కట్టినకట్లు ఎట్లా విప్పుకొన్నాడో ఆదిగాడు, విప్పుకొని కిందపెట్టిన వెంకటసామి తుపాకి తీసుకొని అతన్ని డొక్కలో ఒక గుండు పేల్చి భార్యని తీసుకొనిపోయాడట" అన్నాడు వార్డరు.

"విన్నావా పోలీసాయనా– హుం" అని మీసం దువ్వేడు ఆదిగాడు.

"అట్లయితే వీడిమీద కేసెందుకు?" అని సందేహం కలిగి అడిగాడు 512.

"మనం చేసినపని చట్టం ఒప్పుకోదంట" అన్నాడు ఆదిగాడు.

"కేసు విచారణ పూర్తి అయింది. ఉరిశిక్ష చెప్పారు. రేపో ఎల్లుండో హైకోర్టు నుండి ఉత్తర్వులు రావాలి" అన్నాడు వార్డరు.

512కి గుండె పగిలింది.

"నే చస్తే చచ్చానుగాని పోలీసాయనా- నువ్వే చెప్పు న్యాయం, ఇందులో నే చేసిన నేర మేమిటో, అదే నీ పెళ్ళాం అయిందనుకో, ఏం చేస్తావయ్యా-" అని అడిగాడు ఆదిగాడు.

జెయిలు కమ్ముల చాటున ఉండిపోయాడు గాని, లేకుంటే ఆ ప్రశ్నకు ఆదిగాణ్ణి పొడిచి పారేయా లన్నంత రోషం వచ్చింది 512కి.

"ఛీ! నోరుమూయ్" అని మాత్రం కసురుకొని ఊరుకొన్నాడు 512.

"మామా! నీకో మంచిమాట చెప్తాను, ఏమిస్తా" వన్నది లక్ష్మి.

"మంచిమాటే అయితే కమ్మటి ముద్దిస్తా" నన్నాడు ఆదిగాడు.

"మామా! మా అమ్మగారు రహస్యంగా చెప్పినారు. ఎక్కడా అనవద్దన్నారు. పై కోర్టునుండి ఈ సందెకాడ ఉత్తర్వులు వచ్చినవట. కేసు కొట్టివేశారట. నిన్ను తెల్లవారి ఇడిపిస్తారంట. ఇవిగో! అప్పచ్చులు-" అని మెల్లంగా చెప్పింది లక్ష్మి.

"ఆ! నిజమేనా..." అని గంతువేశాడు ఆదిగాడు.

"నిజమే మామా, పై కోర్టువారు పోలీసువారి సాక్ష్యం నమ్మలేదట. మన సాక్ష్యమే నమ్మినారంట-" అన్నది లక్ష్మి.

"అదీ రంగా! దేవుడెక్కడున్నాడురా, రంగా" అన్నాడు ఆదిగాడు.

"అరవబోకు, అన్నది లక్ష్మి.

"ఆదిగా" అన్నాడు 512.

"మామా, నిన్నిడిపించినారంటే రేపే-

"ఆడనీ సుక్కాని
ఈడనే గెడయేసి
పడవెక్కి భద్రాద్రి కెడదామా,
భద్రాద్రి రాముణ్ణి గొలుతామా,"

అని పాట ఆరంభించి మళ్ళీ నాట్యంచేసింది లక్ష్మి.

512 గడియారం గంటలు, నిమిషాలు, సెకండ్లు లెక్క పెట్టుకొంటున్నాడు.

ఇల్లూ, ఇంటిదగ్గర భార్యా, సబినస్పెక్టరూ తన డ్యూటీ మళ్లా సింహావలోకనంలోనికి వచ్చినవి.

గడియారం టంగున ఒంటిగంట కొట్టి 512 కి డ్యూటీ మార్చింది. ఇక జెయిలుదగ్గర క్షణం నిలవలేక పోయాడు 512. ఆదిగాడు తన దృష్టిలో ఒక మహాయోధుడులాగా ప్రకాశించి పోతున్నాడు. వాడు చేసిన సాహసకార్యం తన పాలిటి కొక తారకమంత్రంలా తోచింది.

భుజంమీద తుపాకీ పెట్టుకొని ఎట్లా వెళ్ళేడో– తన శరీరం తనకు తెలియనిస్థితిలో ఇంటికి వెళ్ళేడు.

సబినస్పెక్టరు కాదు– బ్రహ్మదేవుడయినా తను లేని సమయంలో తన ఇంటివాకిట మెదిలినట్టయితే కాల్చిపారేస్తా నంటూ అంగలు వేస్తున్నాడు 512.

వీథి వాకిటికి పోయి తలెత్తి చూచేవరకు తన వరండాలో ఒక మనిషి నిలబడి, 512 కి కనిపించాడు. 'ఎవరు వా'రని కేక పెట్టాడు 512.

ధాం ధాం అని రెండు తుపాకిగుళ్ళు ఏకకాలంలో పేలినవి.

లైనులో నిద్రించే జనం లేచి గుమిగూడి చీకట్లో లాంతరు దీపంలో వెతికారు. కాలిమీద తగిలిన గుండు దెబ్బకు నెత్తురు వరదలై, వాకిట్లోనే పడిపోయి ఉన్నాడు 512 ఒక్కడూను.

ఇంట్లోకి పోయి చూడగా, తలుపులు తెరచి ఎవ్వరూ లేక ఇల్లంతా బావురుమన్నది.